క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేపల్లె రూరల్: బాపట్ల నుంచి రేపల్లె వచ్చు 132 కేవీ విద్యుత్ లైన్‌ను మార్చడం, బాపట్ల దగ్గర హైవే క్రాసింగ్ కోసం హైట్ టవర్‌లు ఏర్పాటు పనులు ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ తెనాలి ఈఈ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత తేదీల్లో తెనాలి–రేపల్లె మధ్య ఉన్న గ్రామాల్లో చిన్నపాటి విద్యుత్ అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాజ హితుడు ఈఎల్ నారాయణ



బాపట్ల: సమాజ హితమే పరమావధిగా జీవించిన నిస్వార్థ సేవా పరుడు ఈఎల్ నారాయణ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు పేర్కొన్నారు. ఈఎల్ నారాయణ 23వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టరు పి.సి.సాయిబాబు మాట్లాడుతూ ఊరి బాగు , నలుగురి క్షేమం కోసం నిరంతరం తపించిన వ్యక్తి ఈఎల్ అని కొనియాడారు. విజ్ఞాన సమితిని ప్రారంభించి, సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేశారని గుర్తుచేశారు. 'విశ్వ భారతి' నెలకొల్పి బాలల బంగారు భవిష్యత్తు కొరకు పాటు పడ్డారని తెలిపారు. వినియోగదారుల హక్కులపై పలువురికి అవగాహన కల్పించారని గుర్తు చేశారు. ఫిలిం క్లబ్, ద్వారా అందరి మానసిక వికాసానికి దోహదపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.బ్రహ్మయ్య, ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ భగవన్నారాయణ మృతి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ పి.భగవన్నారాయణ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో డాక్టర్ భగవన్నారాయణ మృతదేహాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. డాక్టర్ భగవన్నారాయణ మృతి పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

19 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

తెనాలి: పట్టణ నాజరుపేటలోని అనుగోలువారి వీధిలో గల శ్రీ పాండు రంగస్వామి దేవస్థానం 84వ వార్షిక మహోత్సవాలను ఈనెల 19వ తేదీ నుండి ఘనంగా నిర్వహించనున్నారు. అయిదురోజులు జరిగే ఉత్సవాల వివరాలను ఆలయ అర్చకుడు తురగా నాగరాజుశర్మ శుక్రవారం తెలియజేశారు. 19వ తేదీ ఉదయం ఏడు గంటలకు ఉత్సవాలను ప్రారంభించి స్వామివార్లకు పంచామృతాభిషేకాలు చేస్తామని తెలిపారు. ప్రతిరోజూ స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22 వ తేదీ బుధవారం శ్రీ రుక్మిణీ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, 24వ తేదీ శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదాన వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. వీరితో కాకునూని శివసూర్యకుమార్, కనికిశెట్టి సూర్యనారాయణ, బొంతా నారాయణ, కురిచేటి సుబ్బారావు, చైతన్య, తిరుమలశెట్టి జస్వంత్ సాయి, నరసింహారావు ఉన్నారు.

19న అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఈనెల 19వ తేదీన స్థానిక బోసు రోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని గీతా మందిరంలో అన్నమయ్య పాటల పోటీలను నిర్వహించనున్నారు. శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం ఏడు గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు నాలుగు కేటగిరీల్లో జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. నాలుగు కేటగిరీల్లో జరిగే ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు ఉంటాయని సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆసక్తిగలవారు 9246440685ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

కాబా–మదీనా నమూనాలు

తెనాలి: హజ్ యాత్రను పురస్కరించుకుని మదీనా మదర్సాకు చెందిన అరవైమంది బాలబాలికలు విభిన్న పరిమాణాల్లో ముస్లింలకు అతి పవిత్ర క్షేత్రాల నమూనాలను తీర్చిదిద్దారు. సౌదీ అరేబియాలోని దైవగృహంగా పేర్కొనే కాబా, మదీనా మసర్వా నమూనాలను వీరు రూపొందించారు. స్థానిక మహబ్ రోడ్‌లోని మదీనా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వీటిని ప్రదర్శించారు. వీటిని తిలకించిన ముస్లింలు చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు హాజీ షేక్ యాఖూబ్, కార్యదర్శి షేక్ చాంద్ బాషా, ఇమామ్ ముఫ్తీ పాల్గొన్నారు.

మామిడి మాగించడం ఇలా

జిల్లాలో మామిడి సీజన్ జోరందుకుంది. పలు మార్కెట్‌లలోకి మామిడి పండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి. మామిడి కాయలను కోయటం, మాగించడంలో రైతులు, వ్యాపారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో మాగిస్తేనే రైతులకు లాభాలతో పాటు వినియోగదారులకు ఆరోగ్యం లభిస్తుంది.



- జిల్లాలో జోరుగా మామిడి కోతలు
- మామిడి పక్వానికి తెచ్చే పలు రకాల పద్ధతులు

బాపట్ల: జిల్లాలో రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో మామిడి సాగు ఉంది. మొత్తం 2,200 ఎకరాల్లో సాగు జరుగుతోంది. మామిడి కోతలు, మెళకువలు, కాయను మాగపెట్టే విధానాన్ని వ్యవసాయాధికారిణి శారద తెలిపారు.

మామిడికాయలు కోసే పద్ధతి

మామిడి పిందె ఏర్పడిన తర్వాత పూర్తిగా పక్వానికి రావడానికి 120 నుంచి 150 రోజులు సమయం పడుతుంది. కాయ లోపలి భాగం పసుపు రంగులో మారిన తర్వాతే వాటిని కోయాలి. కాయలను 10 సె.మీ తొడిమి ఉండేలా దోనేతో కోయాలి. కోసిన తర్వాత సొన(జీడి) పూర్తిగా కారేంతవరకు కాయలను కిందనే ఉంచాలి. ముదిరిన కాయలను ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత కోసి ఆరబెట్టాలి. సొన (జీడి) కాయలను తొడిమి వైపు ఉంచాలి. అవకాశం ఉంటే కాయలను మంచి నీటిలో శుభ్రం చేస్తే మంచిది. ఆ నీటిలో టీపాల్ లేక సాండోవిట్ కానీ ఒక ఎంఎల్ కలిపి వాటిలో ముంచి ఆర బెట్టాలి. కాయలను వేడి నీటిలో (52 డిగ్రీల సెంటిగ్రేట్) 3 నుంచి 4 నిమిషాలు ఉంచి శుభ్రం చేస్తే ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. వేడి నీటిలో సోడియం హైపో క్లోరైడ్ లేక ప్రోక్లోరాజ్ 200 పీపీఎం కలిపితే శిలీంధ్రాలు ఆశించవు.

గ్రేడింగ్ చేసే విధానం

కాయ బరువు బట్టి మూడు విధాలుగా గ్రేడింగ్ చేయవచ్చు. 200 నుంచి 2500 గ్రాముల బరువు ఉన్నవాటిని ఒక గ్రేడ్‌గా, 300 నుంచి 350 గ్రాముల బరువు ఉన్నవాటిని ఇంకో గ్రేడ్‌గా మిగిలిన వాటిని మరో గ్రేడ్‌గా తయారు చేసుకోవాలి.

మామిడిలోని పోషకాలు

పండ్లలో మామిడి పండు రారాజు వంటిది. మామిడిలో అత్యంత విలువైన పోషకాలు ఉంటాయి. ఇందులో విటమిన్–సీ 76 శాతం, విటమిన్–ఏ 25 శాతం, విటమిన్–బీ 6 శాతం, ఇతర విటమిన్లు 11 శాతం ఉంటాయి. అదే విధంగా ఈ పండ్లలో ఫైబర్ 9 శాతం, రాగి ధాతువు 9 శాతం, పోటాషియం 7 శాతం, మెగ్నీషియం 4 శాతం ఉంటాయి.

శీతలీకరణ నిల్వ..

మామిడిని శీతలీకరణ గిడ్డంగుల్లో 10 నుంచి 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 80 నుంచి 90 శాతం తేమలో దాదాపు 30 రోజులు నిల్వ ఉంచవచ్చు. బాగా పక్వానికి వచ్చిన మామిడి కాయలు 5 నుంచి 6 రోజుల్లోనే మాగుతాయి. బాగా ముదిరిన కాయలను ఇళ్లలోనే గాలిచొరబడకుండా వరిగడ్డి వేసి మాగపెట్టుకోవచ్చు. ఇందుకు వెదురు బుట్టలను ఉపయోగించుకుంటే మంచిది. 10 ఎం.ఎల్ ఇథైల్, 2 గ్రాముల సోడియం హైడ్రాక్సైడ్‌ను 5 లీటర్ల నీటిలో కలిపి వెడల్పు మూతిగల పాత్రలో ఉంచి మామిడి కాయలు కోసిన గదిలో ఉంచితే ఒక రోజులో కాయలు మాగుతాయి. మామిడి కాయల గదిలో బొప్పాయి, అరటి పండ్లను ఉంచితే అవి ఇథెల్ వాయువు వదలడంతో కాయలు త్వరగా మాగుతాయి.

కార్బైడ్‌తో ప్రమాదం



కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మాగపెట్టడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. దీనిని నుంచి వచ్చే ఎసిటిలిన్ అనే రసాయనం మెదడుకు ఆక్సిజన్‌ను అందకుండా చేస్తుంది. కార్బైడ్‌లో ఉండే ఆర్సానిక్ భాస్వరంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. కొంతమంది రైతులు, వ్యాపారుల కాయలు మాగ బెట్టడానికి కాల్షియం కార్బైడ్‌ను అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇలా మాగ పెట్టడంతో కాయలకు మంచి రంగు ఉంటుందే కానీ రుచి ఉండదు. ఇవి పుల్లగా ఉంటాయి. పైగా ఇవి తింటే అనారోగ్యం పాలవుతారు.

–శారద, వ్యవసాయాధికారి

మాగబెట్టే విధానం..

ఒక గదిలో బోద గడ్డి కానీ, వరిగడ్డి కానీ పరచి వాటిపై కాయలను పేర్చి పైన గడ్డి కప్పాలి. ఇలాగే చేస్తే రెండు, మూడు రోజుల్లోనే కాయలు మాగుతాయి. మంచి నాణ్యత కలిగి ఉంటాయి. దీంతోపాటు మామిడికి మంచి రంగు తెప్పించడానికి అవసరమైతే ఇథైల్‌ను వాడవచ్చు. ఇది రసాయనం కాకపోవడంతో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. లీటరు నీటికి ఒక ఎం.ఎల్ నుంచి 1.8 ఎం.ఎల్ వరకు ఇథైల్ ఉపయోగించి కాయలను మాగపెట్టవచ్చు. ఇథైల్ 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద కలిపి కాయలను 5 నిమిషాల పాటు ముంచి తీసి ఆరబెట్టాలి. మామిడి పండ్లను చెక్క పెట్టెలో కాకుండా, సీఎఫ్‌బీ పెట్టెల్లో 5 నుంచి 10 కిలోల పండ్లను ఉంచి రవాణా చేయవచ్చు. ఏప్రిల్‌లో వచ్చే కాయలు పూర్తిస్థాయిలో ఎదుగుదల లేకపోవడం వల్ల పండ్లలో నాణ్యత ఉండదు. వీటిని మాగ పెట్టేందుకు కార్బైడ్‌ను ఉపయోగించి మార్కెట్‌లో విక్రయిస్తారు. మే, జూన్ నెలల్లో వచ్చే పండ్లు రుచిగా, నాణ్యతగా ఉంటాయి.

ఓటింగ్‌కు 34,106 మంది దూరం

పొన్నూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో పొన్నూరు నియోజకవర్గంలో 2,27,135 మంది ఓటర్లకు 1,93,029 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగ కోసం రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ఈసారి 34,106 మంది వినియోగించుకోకుండా దూరంగా ఉన్నారు. మొత్తం పురుష ఓటర్లు 1,09,008 మంది ఉండగా అందులో 93,464 మంది ఓటు వేశారు. వారిలో 15,544 మంది ఓటు వేయలేదు. మహిళా ఓటర్లు 1,18,116 మంది ఉండగా అందులో 99,552 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో 19,572 మంది ఓటు వేసేందుకు ముందుకు రాలేదు. ఇతరులు 11 మంది ఉండగా వీరిలో ముగ్గురు ఓటు వేశారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం తుది లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 84.98 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ ఏర్పాట్లపై అసంతృప్తి..

ఓటు హక్కు వినియోగంపై అధికార యంత్రాంగం అంతంత మాత్రంగానే ప్రచారం చేయడంతో పాటు.. ఎక్కువగా ఓటింగ్ నమోదయ్యే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాలెట్‌పై అవగాహన కల్పించలేదనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. పోలింగ్ నెమ్మదిగా సాగడం, కొన్నిచోట్ల ఓటు వేయడానికి సుమారు మూడు గంటలకు పైగా సమయం పట్టడంతో పాటు ఎండ, ఉక్కపోతకు తోడు ఏర్పాట్లు సరిగాలేని కారణంగా కొంతమంది వరుసలో నిల్చోలేక తిరిగి వెళ్లిపోయారని పలువురు చెబుతున్నారు. ఒక్కో బూత్‌లో 800 నుంచి 1200 వరకు ఓటర్లు ఉండటం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో నిల్చోలేక ఓటు వేసేందుకు దూరంగా ఉన్నారనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.



ఓటు వినియోగించుకున్న ఓటర్లు(ఫైల్

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం.. డ్రెయిన్లు అధ్వానం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. వార్డులలో రోజుల తరబడి చెత్త, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా రోజుల తరబడి చెత్త ఉంటోందని ప్రజలు చెబుతున్నారు. ప్రధాన డ్రెయిన్లలో సైతం వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తొలగించకపోవడంతో మురుగు పారుదలకు అడ్డంకిగా మారింది. ప్రధానంగా 4వ వార్డు పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్లు స్తంభించి మురుగు ప్రవహించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికంగా ఆలయాలు, కల్యాణ మండపాలు ఉండటంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో ప్రజలు ముక్కు మూసుకుని నడవాల్సిన దుస్థితి నెలకొంది. దుర్వాసన, దోమల బెడదతో జీవనం సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. సైడు కాల్వలతో పాటు రోడ్లపైనే చెత్త రోజుల తరబడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. రహదారులు నిర్మించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఇబ్బంది పడకుండా ఉండే వాళ్లమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై చెత్త ఎక్కడపడితే అక్కడే ఉంటుందని, పట్టణంలో నిల్వ చేరుతున్న చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తకుప్ప



రైలులో జనరల్ బోగీల కోసం కోటి ఉత్తరాలు

లక్ష్మీపురం: ప్రతి రైలులో సాధారణ భోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ విన్నవించారు. స్థానిక గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సాధారణ బోగీల సాధన కోసం ప్రధాన మంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే విధంగా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడం, తొక్కిసలాటలు, గాయాలు, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలై చిన్నారుల ప్రాణాలు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ అంశాన్ని ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా – టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఆఫీస్, 152 సౌత్ బ్లాక్, రైసినా హిల్స్ ,న్యూఢిల్లీ–110011 చిరునామాకు మన బాధను, డిమాండ్‌ను అభిప్రాయాల్ని తెలుపుతూ ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక వేత్తలు చిలువేరు గణేష్, మూషం అనంత రాములు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: మద్యానికి బానిసైన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నందులపేటకు చెందిన మణి (23) మద్యంకు బానిసయ్యాడు. ఖర్చులకు డబ్బులు చాలకపోతుండడంతో గురువారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు తెనాలి వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్ తెలిపారు.

క్రీడా పరికరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం సంయుక్త సహకారంతో సుల్తానాబాద్‌లోని ఎస్ఎస్ యూత్ సభ్యులకు శుక్రవారం క్రీడా పరికరాలను (క్రికెట్ కిట్స్, వాలీబాల్, నెట్‌లు, షటిల్ బాటిల్స్) పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శంకర్ నాయక్, హనుమంత్, మహేష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ కెరటం కలేకూరి ప్రసాద్

నెహ్రూనగర్: కలేకూరి ప్రసాద్ దళిత ఉద్యమ కెరటమని భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. శుక్రవారం కలేకూరి ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలేకూరి చేసిన రచనలు, పాటలతో దళిత ఉద్యమాలకు ఊపిరి పోశారన్నారు. డప్పు ప్రకాష్ మాటకు కలేకూరి ప్రసాద్ పాటతోడై కారంచేడు, చుండూరు తదితర ఉద్యమాలకు బాసటగా నిలిచారన్నారు. కవిగా, సినీ గేయ రచయితగా ఎంతో పేరు ప్రఖ్యాతాలు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కలేకూరి ఆశయ సాధనకు నేటి తరం ఉద్యమ నాయకులు, దళిత, ప్రజా సంఘాలు పాటుపడాలని కోరారు. మాల ఐక్య సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ దళితుల పక్షాల నిరంతరం పోరాటం చేస్తే వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమని వివరించారు. కార్యక్రమంలో కొరివి రజనీకాంత్, శ్యాంసన్, చరబండరాజు, గోపి, శేషు పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో..

విద్యార్థి దశ నుంచే అగ్రవర్ణ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధుడు కలేకూరి ప్రసాద్ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సమాజంలో దళిత ధిక్కార కవిగా, ప్రజా పాటల రచయితగా, దళిత విప్లవ ఉద్యమ కారుడిగా, కారంచేడు, చుండూరు దళిత పోరాటాలకు ఆకర్షితుడై అనేక రకాల బాధ్యతలను స్వీకరించారన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, రావి నూతల కమలకుమారి, బత్తుల అనిల్‌బాబు, డి.రాధాకృష్ణ, బి.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు, కన్నె పిల్లలతో బిందె తీర్థం, అమ్మవారి మూల విరాట్‌కు నవరస ఫల సహిత పంచామృతంతో సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహానికి మహా సంప్రోక్షణ, మహిళలు మల్లెపూలతో సామూహిక పూజలు జరిగాయి. రాత్రి అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమాలను చందలూరి శివప్రసాద్, పద్మావతి దంపతులు సమర్పించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

అంకమ్మతల్లి కొలుపులు ఆరంభం

జంపనివారిపాలెం(భట్టిప్రోలు): మండలంలోని కోనేటిపురం పంచాయతీ జంపనివారిపాలెంలో కొలువై శ్రీ అంకమ్మతల్లి కొలుపుల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే భక్తులు నైవేద్యాలు, మొక్కు బడులు చెల్లించుకున్నారు. అమ్మవారి కొలుపులు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారే కాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సాయంత్రం అమ్మవారి లడ్డు వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వాహకులు జంపని వెంకటేశ్వర రావు, జంపని శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



బిందె తీర్థం తీసుకువస్తున్న మహిళలు, కన్నె పిల్లలు



మహిళల సామూహిక పూజలు

చుండూరు ఓటరు తీరు..

వేమూరు(చుండూరు): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో చుండూరు మండల ఓటర్లు చురుగ్గా పాల్గొన్నారు. వేమూరు నియోజక వర్గంలోని మండలంలో వివిధ గ్రామాల్లో పోలైన ఓట్లు వివరాలను తహసీల్దారు విశ్వనాథం వెల్లడించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు కన్నా ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగిందని ఆయన చెప్పారు.

గ్రామాలు	మొత్తం ఓట్లు,	పురుషులు,	స్త్రీలు	పోలైన ఓట్లు
దుండి పాలెం	2,942	1,286	1,330	2,608
యడ్లపల్లి	3,325	1,398	1,458	2,856
నడిగడ్డవారిపాలెం	1,030	429	404	742
పెనుగుదుపాడు	1,695	727	742	1,469
వేట పాలెం	2,020	860	891	1,751
కేఎస్ పాలెం	460	416	196	416
మున్నంగివారి పాలెం	1,692	800	680	1,480
చుండూరు	2,537	989	1104	2,093
పెదగాదలవర్రు	1,124	463	529	992
మోదుకూరు	5,361	2,041	2,265	4,306
అంబేద్కర్‌నగర్	1,663	682	779	1461
తొట్టెంపూడి	965	414	416	830
కారుమూరా	493	207	233	440
ఆలపాడు	1682	772	770	1532
మండూరు	2,263	893	1060	1,953
వలివేరు	4,094	1,915	2,177	4,092
చినపరిమి	3,934	1,700	1,866	3,566
చిన గాదెలవర్రు	1,110	461	517	933
మొత్తం ఓటర్లు	**38,091**	**15,892**	**16,862**	**32,755**


ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోండి

తెనాలిఅర్బన్: ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని జిల్లా వైద్యశాలలోని జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు డాక్టర్ దివి శ్రీకాంత్, డాక్టర్ టి.వినీల్ సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని జిల్లా వైద్యశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వస్తున్న ఆహారపు అలవాటుల్లో మార్పుల వలన అనేక మంది వ్యాధుల బారినపడుతున్నారని చెప్పారు. బయట ఫుడ్‌ను తగ్గించి ఇంట్లో చేసే వంటకాలను తీసుకోవాలని సూచించారు. ఇలా చేయడం వలన అందరూ ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉందన్నారు. అలాగే మాంసాహారాన్ని ఉపయోగించడం తగ్గించి ఆకుకూరలు, కూరగాయాలు ఎక్కువగా ఉపయోగించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యశాలలో రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే రక్తపోటు ఉన్నవారు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజూష, ఫిజియోథెరపిస్ట్ ఎస్.అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వినీల్

విశ్రాంత చీఫ్ ఇంజినీరు శ్రీరామచంద్రరావు మృతి



తెనాలి: ధవళేశ్వరం విశ్రాంత చీఫ్ ఇంజినీరు చుండూరి శ్రీరామచంద్రరావు (92) గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తమ నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వస్థలం మచిలీపట్నం. తొలుత మచిలీపట్నం, గుడివాడలో పీడబ్ల్యూడీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం జలవనరుల శాఖలో రాష్ట్రంలోని ఒంగోలులోని నాగార్జునసాగర్ కాల్వలు వంటి వివిధ ప్రాజెక్టుల్లో పనిచేశారు. ఖమ్మంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేశారు. సూపరింటెండెంట్ ఇంజినీరుగా విజయవాడలో సుదీర్ఘకాలం పనిచేశారు. అనంతరం ధవళేశ్వరం ప్రాజెక్టుకు చీఫ్ ఇంజినీరుగా చేస్తూ 1990లో రిటైరయ్యారు. అంతకుముందు సీలేరు ప్రాజెక్టులో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలోని ఆయకట్టులో పంటల సాగుకు దోహదపడ్డారు. తెలుగుగంగ స్పెషలాఫీర్ శ్రీరామకృష్ణయ్యతోనూ కలిసి ఆ ప్రాజెక్టులో పనిచేశారు. శ్రీరామచంద్రరావులోని చిత్తశుద్ధి, నిజాయితీని దృష్టిలో ఉంచుకుని నాటి సీఎం ఎన్టీ రామారావు తెలుగుగంగ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని విస్పర్ వాలీలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ అయిన కుమారుడు సీవీ కోటేశ్వరరావు నివాసంలో ఉంటూ అక్కడే మృతిచెందారు.

CHANGE OF NAME

I, MOHAMMAD AKTHARUNNISA (Old Name), W/o. MOHAMMAD AMEER BAIG, resident of D.No: 6-394, M.V.Rajupalem, Karlapalem Village and Mandal, Bapatla District, A.P. I have changed my name as MOHAMMAD AKTHARUNNISA BEGUM (New Name), W/o. MOHAMMED AMEER BAIG, Here after my name is known as MOHAMMED AKTHARUNNISA BEGUM.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, 5వ అంతస్తు, స్టాండర్డ్ భవనము, బొమ్మిదాల కాంప్లెక్స్, కలెక్టరేట్ దగ్గర, గుంటూరు–522004. ఫోన్: 0863-2227736

టెండర్ల ఆహ్వానం కొరకు సంక్షిప్త ప్రకటన

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా "బాపట్ల బ్రాంచి" ఇంటీరియర్స్ ప్రతిపాదిత ఫర్నీషింగ్ వర్క్ కోసం అర్హతగల బిడ్డర్ల నుండి టెండర్లను ఆహ్వానిస్తున్నది. టెండర్లను ఆహ్వానిస్తున్న వివరణాత్మక ప్రకటన కొరకు వెబ్‌సైట్ https://www.centralbankofindia.co.in/en/active-tender AND / OR on https://centralbank.abcprocure.com/EPROC/. ని సందర్శించండి.
టెండర్ల సమర్పణకు చివరి తేది: 27.05.2024 మధ్యాహ్నం 3.00 గం.ల వరకు.
రీజనల్ హెడ్, రీజనల్ ఆఫీస్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుంటూరు.
సంప్రదించవలసిన వ్యక్తి: 1) యమ్.శేషగిరిరావు, ఛీఫ్ మేనేజర్, మొబైల్: 9652932312
2) పి.ఐ.ప్రభుకిరణ్, మేనేజర్, మొబైల్: 8688819091

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com